1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

ఉద్యోగం రావట్లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య


ప్రణయ్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిగ్రీ చదివినా దానికి తగ్గ ఉద్యోగం రావట్లేదని తీవ్ర మనస్థానికి గురై ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన డిచ్‌పల్లి మండలం ముల్లగి చెరువు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మోపాల్ మండలం కంజర గ్రామానికి చెందిన ప్రణయ్‌రెడ్డి(22) డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ఇటీవల హైదరాబాద్ సైతం వెళ్లివచ్చాడు. గల్ఫ్‌కు వెళ్లే ప్రయత్నం చేసి విఫలమైయ్యాడు. ఈ క్రమంలో ఉద్యోగం రాకపోయే సరికి మనస్తాపం చెంది డిచ్‌పల్లి మండలం ముల్లంగి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి గుడి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

జీజీహెచ్ నుంచి యువకుడు అదృశ్యం


గణేశ్(ఫైల్)

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి వ్యక్తి అదృశ్యమైనట్లు నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు శుక్రవారం తెలిపారు. ఎస్ హెచ్ ఓ విజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన కొంకుల గణేష్ (21)కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మందులు తీసుకుంటారు. 15వ తేదీ సైతం తన తండ్రి నారాయణతో కలిసి వచ్చి చూయించుకున్నారు. రాత్రి లేట్ కావడంతో ఆస్పత్రిలోనే పడుకొని పొద్దున వెళ్దామని అనుకొని అక్కడే పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికి తన కొడుకు గణేశ్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీగా వచ్చి ఎన్‌టీఆర్ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న జూనియర్ డాక్టర్‌లు

ప్రాణాలు రక్షించే వారికే రక్షణ లేదు

- లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- జూనియర్ డాక్టర్ల నిరసన
- నేడు జిల్లా వ్యాప్తంగా ప్రవేట్ ఆసుపత్రుల్లో ఓపీసేవలు బంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుండా పోతోందని జూనియర్ డాక్టర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో పీజీ మెడికల్ విద్యార్థినిపై లైంగిక దాడి చేసి, హత్యకు పాల్పడిన ఘటనలో నిందితు డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుండి ర్యాలీ చేపట్టి తిలక్‌గార్డెన్, రైల్వేస్టేషన్ మీదుగా ఎన్‌టీఆర్ చౌరస్తాకు చేరుకొని నిరసన చేపట్టారు. పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. అత్యాచార ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరో సారి పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాలని దోషులుగా నిర్ధారించబడిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రయివేటు ఆస్పత్రుల బంద్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నేడు(శనివారం) ప్రయివేటు ఆస్పత్రులు బంద్ పాటించనున్నాయి. దేశవ్యాప్తంగా వైద్యసేవలు నిలిపివేయాలని ఐఎంఏ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలోనూ వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. జాతీయ కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. దామోదర్ రావు, డా.శ్రీశైలం తెలిపారు. ఈ బంద్ కు ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు ప్రయివేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేత

కామారెడ్డి : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కామారెడ్డి జిల్లాలో శనివారం ఉదయం 6 గంటల నుండి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు ఆస్పత్రులలో ఓపీ సేవలను నిలిపివేస్తున్నామని, అత్యవసర సేవలకు మాత్రమే చికిత్స అందజేయనున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమణ, కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాము పది మంది ప్రాణాలను రక్షించే బాధ్యతలో ఉన్నామని అలాంటిదే తనకే భద్రత లేకపోతే తాము ఎలా విధులు నిర్వహించగలుగుతామని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నిందితునికి కఠినంగా శిక్షించాలని కోరుతున్నట్టు తెలిపారు. నేడు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు.

బడి నిండా సరస్వతీ పుత్రులే

- గతమెంతో ఘనం..
- ప్రస్తుతం ఏకోపాధ్యాయుడితో తగ్గుతున్న ప్రవేశాలు
- ప్రభుత్వ స్కూల్‌కు పంపలేక.. ప్రయివేటులో చదివించేంత స్థోమత లేక విద్యార్థుల తల్లిదండ్రులు సతమతం
- డీఈవో చొరవ తీసుకొని ఉపాధ్యాయుడిని కేటాయిస్తే అడ్మిషన్‌లు పెరిగే అవకాశం





ఏర్గట్ల మండలంలోని నాగేంద్రనగర్ ఎంపీపీఎస్.. తరగతి గోడలపై దేశ, రాష్ట్ర చిత్రపటాలు.. డిజిటల్ పద్దతుల్లో బోధన

నవతెలంగాణ-ఏర్గట్ల

బడి బాగు కోసం ఊరంతా ఒక్కటైయ్యారు. పట్టుబట్టి ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రారంభించుకున్నారు. డిజిటల్ తరగతుల బోధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామస్తుల, మాజీ సర్పంచ్ సహకారంతో ప్రభుత్వ బడికి కార్పొరేట్ హంగులు అద్దాయి. గ్రామస్తుల నమ్మకాన్ని వమ్ముచేకుండా విద్యార్థులు సైతం చదువులో ప్రతిభ కనబరిచారు. ఎంతలా అంటే.. గురుకులాల ప్రవేశాలకు 43 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాస్తే.. 41 మంది విద్యార్థులకు సీట్లు వచ్చేంతా. కట్ చేస్తే ఇద్దరు ఉపాధ్యాయులున్న ప్రైమరీ పాఠశాలలో రెండేండ్లుగా ఒక్క ఉపాధ్యాయుడే విధులు నిర్వర్తిస్తుండటంతో స్కూల్‌కు కష్టాలు మొదలైయ్యాయి. మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని విద్యాశాఖ అధికారులను కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఆర్థికంగా భారమైనా.. తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్ గ్రామంలో పాఠశాలపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రతిభకు కొదవేలేదు. అక్కడ చదువుచున్న విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాల తరహాలో ఉపాధ్యాయులు విద్యనందిస్తున్నారు. కానీ పాఠశాలలో ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయుడు ఉండడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు అందులో చదివించడానికి ఇష్టపడక, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. అక్కడ అధిక ఫీజులు ఉండడం వల్ల తమ కుటుంబాలకు అవి భారంగా మారాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులంతా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడంతో ప్రస్తుతం పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు 16 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు.

విద్యార్థులందరు ఇంగ్లీష్ మీడియం వెళ్తున్నారని తెలుసుకుని 2016లో అప్పటి సర్పంచ్ మంజుల బాలాజీ గౌడ్ సహకారంతో జీపీ ఆధ్వర్యంలో తమ గ్రామానికి ఇంగ్లీష్ మీడియం కావాలని, గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేసుకుని, డీఈఓ వద్దకు వెళ్లి లెటర్ ఇవ్వగా, డీఈవో స్పందించి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం కొనసాగేలా అనుమతి ఇచ్చారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సురేష్, జి.రాజేశ్వర్ విద్యార్థులను మెరికల్లా తయారుచేశారు. వారికి సులభంగా అర్థమయ్యేలా టీవీ ద్వారా ఆన్‌లైన్ నవైపాఠాలు బోధిస్తూ వచ్చారు. ఇదే క్రమంలో గ్రామస్తులు, మాజీ సర్పంచ్ కలిసి పాఠశాలకు రంగులు, గోడలపై గుణింతాలు, రాష్ట్ర, దేశ పటాలు, విజ్ఞానాన్ని పెంపొందించే బొమ్మలను వేయించారు. గ్రామంలోని మహిళా సంఘాలు కూడా తమవంతుగా సహకారం అందించి హ్యాండ్ పంప్ ఉన్న ప్రదేశంలో తాగునీటి కోసం బోర్ వేయించారు. పాఠశా లకు మంచినీటి సౌకర్యం ఏర్పడడంతో, విద్యార్థులు కేవలం శుభ్రమైన, స్వచ్ఛమైన నీరు మాత్రమే తాగాలని ఆలోచించి, గ్రామా నికి చెందిన అప్పటి సర్పంచ్ మంజుల బాలాజీ గౌడ్ ఆయన స్వంత ఖర్చులతో నీటి శుద్దీకరణ యంత్రాన్ని ఏర్పాటు చేయించారు.

అత్యాధునిక సౌకర్యాలను ఉపయోగించుకున్న విద్యార్థులు.. 2020 సంవత్సరం నుండి 2024 వరకు 43 మంది విద్యార్థులు గురుకుల పరీక్షలు రాశారు. అందులో 41 మంది విద్యార్థులకు సీట్లు వచ్చాయంటే ఎంత నిబద్ధతతో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పారో అర్థం చేసుకోవచ్చు. 2022 జనవరిలో 317 జీఓలో భాగంగా ఒక ఉపాధ్యాయుడు కామారెడ్డికి బదిలీపై వెళ్ళగా ఈ పాఠశాలకు మళ్ళీ కష్టాలు మొదలయ్యాయి. ఒకే ఉపాధ్యాయుడు ఉండడం వల్ల విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతూ.. వచ్చింది. అప్పటి నుండి ఈ సంవత్సరం వరకు సురేష్ అనే ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే విద్యార్థులకు పాఠాలు చెపుతూ వచ్చారు. ఏదైనా కారణం చేత ఉపాధ్యాయుడు సెలవులో వెళితే ఆ రోజు సదరు పాఠశాలకు ఎంఈఓ సీఆర్పీని పంపి పాఠాలు బోధింప చేసేవారు. ఈ సంవత్సరం జూన్‌లో ఇంకో ఉపాధ్యాయుడిని కేటాయిస్తారనే ఆశతో 30 మంది విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలకు పంపారు. ఉపాధ్యాయుడు రాడని తెలిసి, నిరాశతో తిరిగి వారి పిల్లలను మళ్ళీ ప్రైవేట్ పాఠశాలలకు పంపారు. ప్రస్తుతం పాఠశాలలో 16 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ)పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని కేటాయిస్తే తమ పిల్లలను మరలా ప్రభుత్వ పాఠశాలకు యధావిధిగా పంపుతాం అని తల్లిదండ్రులు అన్నారు. జిల్లా కలెక్టర్ అయినా చొరవ తీసుకుని పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని పంపితే, విద్యార్థులకు వేరొక గ్రామం వెళ్ళే బాధలు, తల్లిదండ్రులకు ఫీజుల బాధలు తప్పుతాయని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

ఏకోపాధ్యాయుడి పాఠశాలలు ఐదు

మరో విషయం ఏమిటంటే ఏర్గట్ల మండలంలో 5 ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. గతకొన్ని రోజుల క్రితం నవతెలంగాణ ఈ విషయమై కథనం రాయగా... వచ్చే డీఎస్సీలో ఉపాధ్యాయుల భర్తీ ఉంటుందని, సమస్యను డీఈఓ వద్దకు తీసుకువెళ్తామని మండల విద్యా శాఖకు చెందిన అధికారి చేతులు దులుపుకున్నారు. ఇకనైనా ఉన్నత విద్యాశాఖాధికారులు జిల్లా లోని మారుమూల మండలమైన ఏర్గట్ల మండల పాఠశాలల కష్టాలు తెలుసుకుని, స్పందిస్తారని అనుకుంటూ.. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులను వెంటనే కేటాయించి, నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.


తరగతి గోడలపై రాయించిన గుణింతాలను చదువుతున్న పిల్లలు

మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలి

నాగేంద్ర నగర్ మాజీ సర్పంచ్, మంజుల బాలాజీ గౌడ్



సర్పంచ్‌గా ఉన్న సమయంలో పాఠశాలకు అనేక సందర్భాల్లో మా వంతు సహాయాన్ని అందించాం. పాఠశాలలో విద్యార్థుల ప్రతిభకు కొదవలేదు. చాలా మంది విద్యార్థులు ఈ పాఠశాల తరపున గురుకుల సీట్లు సంపాదించారు. కానీ ఇక్కడ ప్రధాన సమస్య ఏమిటంటే ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో చదువు సరిగా అందదని విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను వేరే గ్రామాలకు పంపిస్తున్నారు. డీఈఓ చొరవ తీసుకుని మా గ్రామానికి మరో ఉపాధ్యాయుడిని కేటాయించి, విద్యార్థుల చదవుకు భరోసా ఇవ్వాలని కోరుతున్నాం.

టీయూకు వీసీని నియమించాలి

- కమిటీ పేరుతో కాలయాపన చేయొద్దు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సంతకాల సేకరణలో ఎస్ఎఫ్ఐ నాయకులు

తెలంగాణ యూనివర్సిటీకి రెగ్యూలర్ వైస్ ఛాన్సలర్ (వీసీ)ని నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. సెర్చ్ కమిటీ పేరుతో కాలయాపన చేయడం సరికాదని అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) టీయూ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్ ముందు టీయూకు వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని కోరుతూ శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 09 నెలల కాలం గడుస్తున్నా ఇప్పటికీ వైస్ ఛాన్సలర్లను నియమించకపోవడం బాధాకరమని అన్నారు. యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేక పోవడం తో యూనివర్సిటీ అభివృద్ధి జరగడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించిదని, యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించడం లో అలసత్వం మానుకోవాలన్నారు. ప్రజా పాలన లో నైనా ఈ యూనివర్సిటీ అభివృద్ధికి అనేక నిధులు కేటాయిస్తారనుకుంటే నామమాత్రపు నిధులను కేటాయించడం దారుణ మన్నారు. వెంటనే తెలంగాణ యూనివర్సిటీ కి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌ని నియమించి అధిక నిధులు కేటాయించాలని, లేకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు శివ, ప్రసాద్, యూనివర్సిటి సహయ కార్యదర్శి చరణ్, వినీత్, చక్రి, నాయకులు దినేష్ పాల్గొన్నారు.

ఏకధాటి వర్షం

- సుమారు మూడు గంటల పాటు భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఉక్కపోత నుంచి ఉపశమనం


నిజామాబాద్ నగరంలో..

నవతెలంగాణ-నిజామాబాద్/కామారెడ్డి/ఎడపల్లి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా సుమారు మూడు గంటల పాటు వర్షం కురిసింది. దీంతో నగరాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాగా గత నాలుగు రోజులుగా తీవ్ర ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు.. భారీ వర్షంతో ఉపశమనం పొందారు.

నిజామాబాద్ నగరంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకదాటిగా సుమారు మూడు గంటల పాటు కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రయినేజీలు ఉప్పొంగి రోడ్లమీద నుంచి వరద నీరు పారింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నగరంలోని ఎల్లమ్మగుట్ట చౌరస్తాతో పాటు, జడ్పీ ఆఫీస్ వద్ద రోడ్లు నీటమునిగాయి.

కామారెడ్డిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలు పాటు ఏడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. కామారెడ్డిలో వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుండి ఇదే అతిపెద్ద వర్షం అని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. సుమారు నాలుగు గంటల పాటు ఏకదాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమైయ్యాయి. ఉరుములు మెరుపులతో వర్షం రావడం వలన ఎక్కడ పిడుగు పడుతుందోనని ఎడపల్లి మండల ప్రజలు బయందోళనలో ఉన్నారు. పురాతన ఇండ్లల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని కూలే దశలో ఉన్న ఇండ్లల్లో ఎవరూ నివసించొద్దని తహసీల్దార్ ధన్వాల్ సూచించారు. అలాంటి ఇండ్లల్లో ఉండే వారికి ప్రభుత్వ కార్యాల యాల్లో సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.


కామారెడ్డిలో కురుస్తున్న భారీ వర్షం


ఎడపల్లిలో..

17 శాతం హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

- టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ నగర కార్పొరేషన్ సరిహద్దు నుండి 8 కిమీల పరిధిలో ఉన్న గ్రామాలు, తండాలకు 17 శాతం హెచ్ ఆర్ ఏ అమలు చేసే క్రమంలో గతంలో ఇచ్చిన ఉత్తర్వుల జాబితాలో కొన్ని చేర్చలేదు అని, వాటిని కూడా జాబితా లో చేర్చాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కి టీఎస్ యుటిఎఫ్ నిజామాబాద్ జిల్లా కమిటీ పక్షాన శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మాక్లూర్ మండలంలోని ఆమ్రాదు తండా, మదన్‌పల్లితండా, సట్లాపూర్ తండా, గద్వాల్ క్యాంపు, వేణు కిసాన్ నగర్, ఒడ్డెర కాలనీ (మామిడిపల్లి), జక్రాన్ పల్లి మండలంలోని పుప్పాలపల్లి, డిచ్‌పల్లి మండలంలోని వెస్లీ నగర్ లకు 17 శాతం ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ ఆర్) చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ రమేష్, జిల్లా ట్రెజరర్ ఎం.మల్లేష్, జిల్లా కార్యదర్శులు ఎమ్. జనార్దన్, వి. సాయన్న పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

రెండు గోల్స్ కొట్టి ఆకర్షణగా నిలిచిన భారత జట్టు క్రీడాకారిణి సౌమ్య

జిల్లా జట్టు 3-0 విజయంతో శుభారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పలువురు

జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కవిత సౌజన్యంతో 10వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్ శుక్రవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఏఆర్ ఏసీపి నాగయ్య, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి జీపి ఫాల్గుణ హాజరై మాట్లాడారు. క్రీడాకారు లు పదవ తరగతి వరకు పాఠశాలలలోని వ్యాయామ ఉపాధ్యాయుల చొరవతో ఎంతో ఇష్టంగా క్రీడల్లో రాణిస్తారని అనంతరం ఇంటర్ విద్య లో పడి క్రీడల ను మధ్యలోనే వదిలేస్తున్నారని అన్నారు. ఏదైనా క్రీడల్లో తమ గోల్స్ ని ముందుగానే పెట్టుకొని దానిని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని వారు కోరారు.

అనంతరం జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి, బొబ్బిలి నరసయ్య రాష్ట్ర బాస్కెట్బాల్ సంఘం అధ్యక్షులు మంతెన రాజేందర్రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు కొదవలేదని జిల్లాలో ఎండల సౌందర్య , నికత్ జరీన్ , హుస్సాముద్దీన్ గుగులోత్ సౌమ్య లాంటి అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసిన పురిటి గడ్డ నిజామాబాద్ అని కొనియాడారు. అనంతరం క్రీడాకారులు చేసిన మార్చ్ ఫస్ట్ గౌరవ వందనాన్ని ముఖ్య అతిథులు విశిష్ట అతిథులు స్వీకరించారు. అనంతరం జిల్లా తరపున నుండి భారత జట్టులో రాణిస్తున్న గుగులోతు సౌమ్య తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ టోర్నమెంట్ కు రాష్ట్రంలోని 9 జిల్లాలు పాల్గొంటున్నాయని వీరికి లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచులు నిర్వహింస్తున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మీర్ ఫారుక్ అలి, మహమ్మద్ జావిద్ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ మాదవ్‌నగర్‌లోని ఇందుర్ క్యాన్సర్ ఆసుపత్రి నందు బ్రిడ్జ్ గ్యాప్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆయన చిన్నబాబు సుంకాల తో కలిసి ప్రారంభించారు. పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, జ్ఞానేంద్రియాల క్యాన్సర్ ఎక్కువగా సోకుతుందని, వ్యాధి ముదిరే వరకు తెలుసుకోకపోవడం వల్ల ప్రాణాలకు ముప్పు వస్తుందన్నారు. అందుకే ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటుగా ప్రత్యేక పరీక్షలు నిర్వహించితే వ్యాధి నిర్ధారణ కొరకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. 50 సంవత్సరాలు దాటిన స్త్రీ పురుషులు క్యాన్సర్ కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని దీని మూలంగా ప్రాథమిక సమయంలోనే గుర్తించి వైద్యం చేయటానికి అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ సహకారంతో క్రమం తప్పకుండా తాము ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు.

ప్రభుత్వ యూరాలజిస్ట్ డాక్టర్ శ్రీని అత్తిలి మాట్లాడుతూ.. ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి నందు క్యాన్సర్ కు సంబంధించి అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని వైద్య పరీక్షలు నిర్ధారణ చికిత్స ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే ఇక్కడ మెరుగైన ట్రీట్మెంట్ లభిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బుద్దా శ్రీనివాస్, డాక్టర్ కిరణ్ డాక్టర్ సూరి తదితరుల నేతృత్వంలో క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఈవిల్ నారాయణ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు కార్యదర్శి ప్రసాద్ రావు నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యేను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ సన్మానించింది. దాదాపుగా వందమందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

నిజాయితీ చాటుకున్న వ్యక్తి

- పోలీస్ స్టేషన్లో పర్సు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్


పర్సు అందజేస్తున్న పోలీసు

పట్టణ ప్రాంతాలకు చెందిన రవీందర్ గౌడ్ తన నిజాయితీని చాటుకున్నారు. పట్టణానికి చెందిన శ్రీనివాస్ పర్సును మామిడిపల్లి సమీపంలో పోగొట్టుకున్నారు. దొరికిన పర్సును రవీందర్ గౌడ్ స్థానిక పోలీసులకు అప్పజెప్పగా పోలీసులు వివరాలు సేకరించి బాధితుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. పోలీసుల సమక్షంలో శ్రీనివాస్‌కు పోగొట్టుకున్న తన పర్సును అప్పజెప్పారు. పర్స్ పోగొట్టుకున్న సమయంలో 5 వేల నగదు ఉందని శ్రీనివాస్ తెలిపారు. పట్టణ పోలీసులు రవిందర్‌గౌడ్‌ను అభినందించారు.

కృతజ్ఞత అభినందన తీర్మానం అందజేత

నవతెలంగాణ - బాల్కొండ


ర్యాలీలో పాల్గొన్న రైతులు, నాయకులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని నాగపూర్ గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ అద్ప శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏఈఓ రేష్మకు కృతజ్ఞతా అభినందన తీర్మానం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరుణాకర్‌కు డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



తెలంగాణ యూనివర్సిటీలోని సారంగాపూర్ బీఈడీ కళాశాలలో అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న ఆర్ కరుణాకర్‌కు ద్రవిడియన్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ లభించింది. దీనికి సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన తెలంగాణ రాష్ట్ర మొదటి ఎడ్ సెట్ కన్వీనర్, ఫార్మర్ డీన్, ఎమిరిటస్ ప్రొఫెసర్ పడాల ప్రసాద్ పర్యవేక్షణలో "గిరిజన ప్రాంతాలలో ప్రాథమిక విద్య యొక్క సమస్యలు ఐటీడీఏ ఉట్నూరు" అనే అంశంపై అధ్యయనం చేశారు. డాక్టరేట్ ప్రధానం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పర్యవేక్షకుడు ప్రొఫెసర్ పడాల ప్రసాద్ కి, ద్రవిడ యూనివర్సిటీకి చెందిన కోఆర్డినేటర్ దుర్గా ప్రవీన్ కి, ఫార్మర్ వైస్ ఛాన్సర్ ఆచార్య కొలకలూరి మధు జ్యోతి కి కృతజ్ఞతలు తెలియజేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈయన తల్లి బీడి కార్మికురాలు భారతి, తండ్రి రామగౌడ్. గిరిరాజ్ కలాశాలలో డిగ్రీ, తర్వాత బీఈడీ, ఎమ్ఎడ్, ఎంఎస్సీ సైకాలజీ చదివారు. గతంలో సద్గురు బండాయప్ప స్వామి బీఈడీ కళాశాలలో, కాటిపల్లి రవీందర్‌రెడ్డి బీఈడీ కళాశాలలో కొన్ని సంవత్సరాలు పనిచేసిన తర్వాత, 2014నుండి తెలంగాణ యూనివర్సిటీలో సారంగాపూర్‌లోని బీఈడి కళాశాలలో అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్నారు. చిన్నప్పటినుండి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగాడు.

సుద్దపల్లి గ్రామఅభివృద్ధి కమిటీ ఎన్నిక


నూతన గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి గ్రామ అభివృద్ధి కమిటిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులుగా గుండ పావురాజ్, ప్రధాన కార్యదర్శి రమణచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దుంపటి భూమయ్య, సాయిలు, సుబన్న, వినోద్ రెడ్డి, రమేష్, గంగాధర్, రాజన్న, సురేందర్ గౌడ్, సాయి కుమార్, దత్తు, సాగర్, లింగయ్య, ఎల్లయ్య, శ్రీను, తిక్కన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా ఉంటునే అభివృద్ధి చేసుకుంటామని వారన్నారు. తమపై నమ్మకముంచిన వారందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్


తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భీంగల్

ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని ఎరువుల దుకాణ యజమానులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏడిఏ మల్లయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి దుకాణ యజమాని స్టాకు వివరాలను బోర్డుపై కనిపించే విధంగా ఉంచాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈపాస్ ద్వారా ఎరువులను విక్రయించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీ లో ఏడిఏ మల్లయ్య, ఏఈవో లక్ పతి ఉన్నారు.

బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల్లో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా డిచ్ పల్లి, ఇందల్‌వాయి బంద్‌కు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ హిందూ సంఘాలు బంద్‌కు పిలుపు ఇచ్చారు. తెరిచిన దుకాణ దారులకు, షోరూమ్‌లను బంద్ చేయించారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవి వినోద్ రెడ్డి, మహేందర్, విజయ్, వినోద్, ఉత్తేజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిజామాబాద్ సిపి కల్మేశ్వర్ ఆదేశంతో శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ వాడకం తప్పనిసరి అని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుల్ సాయికుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ మహిళలను తక్కువ చేసి మాట్లాడటం సిగ్గుచేటు

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మానాల మోహన్‌రెడ్డి
- కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్/బాల్కొండ/మోర్తాడ్/ఏర్గట్ల/ముప్కాల్


కంఠేశ్వర్: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణలోని మహిళలపట్ల అగౌరవంగా, వాళ్ళని కించపరుస్తూ ఆర్టీసీ బస్సులో బ్రేక్ డ్యాన్సులు చేస్తారని మాట్లాడినందుకు నిరసనగా శుక్రవారం నిజామాబాద్ నగరంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. 10 సంవత్సరాలు క్లబ్బులలో గడిపిన కేటీఆర్‌కు మహిళలను గౌరవించడం తెలియదని అన్నారు. ఎక్కువ దూరం బస్సులో ప్రయాణించే మహిళలు వారి ప్రయాణంలో సమయాన్ని వృథా చేయకుండా దారంతో అల్లికలు చేస్తుంటే కేటీఆర్ వ్యంగంగా బస్సుల్లో రికార్డింగ్ డ్యాన్సులు చేయాలని వారిపై తప్పుగా మాట్లాడారని అన్నారు. జిల్లాలో ఉన్న బిఆర్ఎస్ నాయకులకు, ప్రశాంత్ రెడ్డికి కేటీఆర్ మాటలు ఎందుకు వ్యతిరేకించడం లేదని, కేటీఆర్ మాటల్లో తప్పు ఎందుకు కనబడడం లేదని ప్రశ్నించారు. వెంటనే జిల్లాలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు జిల్లా మహిళలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ ను మహిళ లోకానికి క్షమాపణ చెప్పమని కోరాలని మానాల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మఠం రేవతి,మహిళా నాయకులు గాజుల సుజాత, మల్లైకా బేగం, అపర్ణ, మీనా, సంగెం సాయిలు, గోవర్ధన్, ప్రమోద్, సంగుబాయి, విశాల్, నిఖిల్ రెడ్డి, గౌతం, ఆకుల మధు, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ తెలంగాణ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు జావిద్, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మోర్తాడ్: జాతీయ రహదారి 63 బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన కేటీఆర్ తక్షణమే తెలంగాణ మహిళ లోకానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళలోకం కేటీఆర్‌కు గుణపాఠం చెప్తుందని అన్నారు. కార్యక్రమంలో గోపి, మైపాల్ రేవంత్, సురేష్, శ్రీనివాస్, సంతోష్, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

ఏర్గట్ల: మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ రెడ్డి మాట్లాడుతూ... మహిళా సాధికారత మీద సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టి, వారిని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేయాలని పాటుపడుతుంటే యావత్ మహిళా లోకాన్ని కించపరుస్తూ..మహిళలందరూ వారి కుటుంబాలతో బ్రేక్ డ్యాన్సులు చేసుకోండని అవమానకర రీతిలో మాట్లాడడాన్ని నిరసిస్తూ... కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశామని అన్నారు. వెంటనే ఆయన తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమదేవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్,నాయకులు ఆడేం గంగాప్రసాద్,గడ్డం జీవన్ రెడ్డి,ముస్కు మోహన్ రెడ్డి,బద్దం లింగారెడ్డి,దండేవోయిన సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్ర మహిళలపై ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డిలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ డెలిగేట్ కార్యదర్శి జైడి చంద రవి, కిసాన్ కాంగ్రెస్ ఖేత్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, కొమ్ముల శ్రీనివాస్, ప్రశాంత్, సుభాష్, ముస్కు ముత్తెన్న, లక్ష్మణ్, రాజ్ కుమార్, రాజు వెంకట్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాల్కొండలో..


మోర్తాడ్‌లో..


ఏర్గట్లలో..


ముప్కాల్‌లో..

చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చెయ్యాలని ఈనెల 22 న ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని వారు అన్నారు. మరో వైపు బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డులను కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజుల్లోనే రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తుందని వారు అన్నారు. బీడీ కంపెనీలో పనిచేస్తున్నవారికి రూ.4016 రూపాయలను జీవన భృతి, ఇండ్ల నిర్మాణాల కోసం 10 లక్షల రూపాయలను వెంటనే అమలు చేయాలని వారు అన్నారు. ఫీజు రియంబర్మెంట్స్ స్కాలర్షిప్ బకాయిలు ఎనిమిది నుంచి పదివేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్న విడుదల చేయకపోవడం సరైనది కాదని వారు అన్నారు. బకాయిలు పెండింగ్లో ఉండడం వల్ల విద్యార్థులు పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని వారన్నారు తక్షణమే ఫీజు రియంబర్మెంట్స్ బకాయిలను స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. నిరుద్యోగంపై శ్వేత పత్రం ప్రకటించి జాబ్ క్యాలెండర్‌ని విడుదల చేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కచ్చితంగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ జిల్లా నాయకులు బి.దేవారం, సారసురేశ్, గంగాధర్, కిషన్, రమేష్, సత్తెమ్మ, మల్లేష్, రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎం.నరేంధర్, ఐఎఫ్టియు అరవింద్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్ పేయికి నివాళ్లు

నవతెలంగాణ-ఆర్మూర్

భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బీహారి వాజపేయి 6 వర్ధంతిని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి , మునిసిపల్ ఫ్లోర్ లీడర్ జీవి నర్సింహా రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రదినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, బీజేపీనాయకులు ఆకుల శ్రీనివాస్, రంగన్న, ప్రధాన కార్యదర్శులు పోల్కం వేణు, పులి యుగేందర్, నాయకులు కందేశ్ ప్రశాంత్,అరె రాజేశ్వర్, విజయానంద్, గంగాధర్ తదితరులు వాజపేయి నివాళిలు అర్పించి వారి సేవలను కొనియాడారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డిని ఘన్పూర్ ఇస్లాంపూరలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ మాస్‌జిద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి సానుకూలంగా స్పందించారని అన్నారు. అభివృద్ధికి నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేకు కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ షాదుల్లా, రామకృష్ణ, భూపతి, ఇస్లాంపుర మజీద్ కమిటీ అధ్యక్షుడు హమీద్ పషా, అహ్మద్ పషా, ఇలియాస్, సైఫ్, సమీపాషా, వసీం, హకీమ్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కళాబృందం ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ నేతృత్వంలో కళాజాత బృందం ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఏసీపీ నారాయణ, సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ.. నిజామాబాద్ కమిషనరేట్‌లో హెల్మెట్ తప్పనిసరి నిబంధన పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిబంధన ఉల్లంఘించే వారికి జరిమానాలు అమలు చేస్తున్నామన్నారు. ఇకపై స్పెషల్ డ్రైవ్‌లు పెంచుతామని, పదేపదే నిబంధన ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరిస్తూ పోలీస్‌శాఖ అమలు చేస్తున్న నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ఉండడంతో ప్రమాదాల బారినపడి తనకు గాయాలవుతున్నయని అన్నారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు.

నేడు బాల్కొండ బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-బాల్కొండ

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం బాల్కొండ మండలం స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిస్తున్నామని హిందూ జనజాగారణ సమితి బాల్కొండ మండల నాయకులు తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులకు మద్దతు తెలుపుతూ బాల్కొండ మండల ప్రజలు నేడు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. హిందూ జనజాగరణ సమితి మండల సభ్యులు కత్రాజీ నరేందర్, అంబటి నవీన్, కొడిచర్ల రామకృష్ణ, ఆరెపల్లి రాజేశ్వర్, అంబటి కిషన్, ఆరెపల్లి నర్సయ్య, కుందారపు శ్రీనివాస్, తౌట్ రాజేశ్, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

11మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం 11మంది పేకాట రాయులను అరెస్టు చేసినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలుగులో మేరకు వివారాలు ఎలా ఉన్నాయి. ఉప్లూర్ గ్రామంలోని ఓ సంఘ భవనంలో గల ఒక ఆర్డర్ మెస్‌లో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ అనిల్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి రైడ్ చేశారు. ఆ సమయంలో సంఘ భవనంలో 11మంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.8వేల 440 స్వాధీన పరుచుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.అనిల్ రెడ్డి తెలిపారు.

ఎస్‌సీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-సిరికొండ


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మండల కేంద్రంలోగల ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆశిష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టి హాస్టల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశిష్ మాట్లాడుతూ హాస్టల్ ఊరి చివరన వ్యవసాయ భూముల్లో నెలకొల్పడంతో కొద్దిపాటి వర్షాలకే చిత్తడిగా మారుతుందన్నారు. చుట్టుపక్కల గల వ్యవసాయ పొలాలలోని నీరు అంత హాస్టల్ పరిసరాలకు చేరుకుంటుందన్నారు. సర్పాలు తరచుగా రావడంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. హాస్టల్ కు వచ్చే రోడ్డు కూడా సరిగా లేక బురదమయమై విద్యార్థులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయని, నాసిరకం ఆహారం పెడుతున్నారని తెలిపారు. హాస్టల్లో నుంచి స్కూల్ మూడు కిలోమీటర్ల దూరం ఉండడంతో విద్యార్థులు కాలినడకన వెళ్లి రావాల్సి వస్తుందన్నారు. ఇంచార్జ్ వార్డెన్ అడపాదడప రావడం తప్ప విద్యార్థుల బాధలు తెలుసుకోవడం లేదన్నారు. దీంతో జాయిన్ అయిన విద్యార్థులు కూడా మధ్యలో వదిలి వెళ్ళిపోతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా హాస్టల్ విద్యార్థుల గోడు అర్థం చేసుకొని సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమం లో ప్రణీత్, రాజేష్, ప్రవీణ్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన ఎక్సైజ్ కార్యాలయం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణ శివారులోని మామిడిపల్లి ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఎక్సైజ్ కార్యాలయ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. దీనితో పాటు బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, భీంగల్‌లో భవన నిర్మాణ పనులు ఆరు నెలల క్రితం పూర్తయ్యాయి. కాగా జిల్లాలో నూతనంగా నిర్మించిన మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభానికి సంబంధిత అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేస్తుంది. 2018లో అప్పటి ప్రభుత్వం భవనాల నిర్మాణం కోసం 40 లక్షల చొప్పున నిధులను విడుదల చేసింది. నిధులు సరిపోక, బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో పనులు పూర్తి కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆయా ఇంజనీరింగ్ శాఖలకు ఆదేశాలను జారీ చేయగా పనులు త్వరితగతిన పూర్తయ్యాయి. ఇప్పటివరకు అద్దె భవనాలలో స్టేషన్లను కొనసాగిస్తున్నారు. పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం ప్రస్తుతం టీచర్స్ కాలనీలో అద్దె భవనంలో కొనసాగుతుంది.

కాలువకు దారేది

- వ్యర్థాల నిల్వతో దుర్వాసన

నవతెలంగాణ-బాల్కొండ



కాలువలోని నీరు నిలిచిపోయి అధ్వాన్నంగా తయారయింది. మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి సమీపంలోని కాలువలో గత కొన్ని రోజులుగా నీరు, వ్యర్థాలతో నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని, కుక్కలు, పందులు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోయారు. మురుగునీరు నిల్వతో దోమలు విజృంభిస్తున్నాయని, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృశ్య భయాందోళనకు గురవుతున్నామని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజారోగ్యంపై దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు.

అవకతవకలపై అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-పొతంగల్


మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని పేరెన్నిక గాంచిన సహకార సంఘం అవకతవకలపై మహాజన సభలో చర్చించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో సమావేశం నిర్వహించగా.. కొంతమంది పాలకవర్గ సభ్యులు తెలిపిన అభ్యంతరాలను కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభిప్రాయాలను సేకరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగు న్యాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో గంగాధర్, రమేష్, గోపాల్‌రెడ్డి, లింగప్ప, నాగనాథ్ పటేల్, శంకర్, పవన్ కుమార్, లక్ష్మన్, విఠల్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆట వస్తువులు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్


ఆట వస్తువులు అందజేస్తున్న గంగల రవీందర్

మండల కేంద్రంలోని క్రీడాకారులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ ముదిరాజ్ ఆట వస్తువులు, వాలీబాల్, నెట్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని, త్వరలోనే రెండు ఎలక్ట్రికల్ పోల్స్, లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రోహిత్, అంజు సింగ్, సాగర్, వంశీ భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మీటర్ ఉండాల్సిందే

- విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-గాంధారి

ప్రతి ఇంటికీ మీటర్ ఉండాల్సిందే.. రీడింగ్ తిరగాల్సిందేనని విద్యుత్ అధికారులు అన్నారు. మండలంలోని సర్వాపూర్ సెక్షన్ పరిధిలోని గండివేట్ తండాలో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తండాలో గల విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఒకేసారి 30 మంది వినియోగదారులకు కొత్త మీటర్లకు డీడీలు కట్టించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు


అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా ఇస్తున్న 200 యూనిట్ల వరకు జీరో బిల్లు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మీటర్ తీసుకొని లబ్ది పొందాలని అన్నారు. వర్షాకాలంలో తడి చేతులతో స్టార్టర్ డబ్బాలు తకావద్దని, విద్యుత్ ప్రవహించే వాటిపై తడి బట్టలు వేయొద్దని సూచించారు. ఏ సమస్య ఉన్నా స్థానిక ఏఈ, లైన్‌మెన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ అమిరోద్దీన్, లైన్‌మెన్లు తిరుపతిరెడ్డి, గంగాధర్, జూనియర్ లైన్‌మెన్లు శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ నేనావత్ గంగాధర్, లచ్చిరాం, రూపులాల్ తదితరులు పాల్గొన్నారు

తండాల్లో గంజాయి నిర్మూలనకు తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పలు తండాల్లో పోలీసులు, ఆబ్కారీ అధికారులు గంజాయి నిర్మూలనలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గాంధారి మండలంలోని నేరేల్‌తండా, చద్మల్ తండా, బీర్మల్ తండా, కొత్త బాది తండా, గుజ్జుల్ తండా, సోమారం తండా, గొల్లాడి తండాలలో గల పంట పొలాలలో, అటవీ భూములలో దాదాపు 100 మంది సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఎవరైనా గంజాయి పండించినా, రవాణా చేసినా, ఎవరి దగ్గరైనా ఉన్నా పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈ తనిఖీల్లో సదాశివనగర్ సిఐ సంతోష్, ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, సదాశివనగర్ ఎస్సై రంజిత్, జిల్లాలోని పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆబ్కారి శాఖకు చెందిన సీఐ షాకీర్, ఎస్సై గంగాధర్, సిబ్బంది సైతం పాల్గొన్నారు.

శివాలయం చైర్మన్‌గా హరికాంత్ చారి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో ప్రాచీన ఏకచక్రేశ్వర శివాలయం నూతన కమిటీని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకులు హరికాంత్ చారి, ఆలయ కమిటీ సభ్యులుగా సింగం లక్ష్మణ్, కమల భూమేష్, మధుర కవిత, తాడు మహేష్, జమేధర్ నగేష్, సూర లింగం, భాస్కర్ గణేష్ శర్మ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా హరికాంత్ చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయానికి దర్శించుకునే భక్తులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

బోధన్ రూరల్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.రాజశేఖర్

నవతెలంగాణ-బోధన్



బోధన్ రూరల్ ఎస్‌హెచ్‌వోగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమ్మర్‌పల్లి నుంచి బదిలీపై ఆయన బోధన్‌కు వచ్చారు. గతంలో బోధన్ రూరల్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన నాగనాథ్ వేల్పూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ బోధన్ రూరల్ గ్రామాల ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కూడా కాల్ చేసి పోలీసు సహాయం పొందాలని సూచించారు. చట్టవ్యతిరేక పనులకు ఎవరూ పాల్పడవద్దని తెలిపారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

- ఎస్సై ఈ.సాయన్న


హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

నవతెలంగాణ-రెంజల్

ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని రెంజల్ ఎస్సై ఈ.సాయన్న స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని కందకుర్తి గ్రామంలో ప్రజలకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఇకనుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని లేనియెడల జరిమానా విధించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వాహనంపై వెళ్లే సమయంలో ఫోన్‌లో మాట్లాడవద్దని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనంపై ముగ్గురు ప్రయాణం చేస్తే కూడా వారిపై చర్యలు తీసుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-కామారెడ్డి/దోమకొండ

కామారెడ్డి నియోజకవర్గంలోని రాజంపేట్, మాచారెడ్డి, పాల్వంచ, బిబిపేట్ తదితర మండలాల్లో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు తీసుకునేందుకు మీరు నియోజకవర్గ కేంద్రానికి రాకుండా, నేనే మీ మండలానికి వచ్చి మీ మండల కేంద్రాల్లోనే చెక్కులను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు.

దోమకొండ : దోమకొండ, బీబీపేట్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముఖ్యమంత్రి సీఎం సహాయనిధి చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఆదుకోవడానికి అత్యవసర సమయంలో వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ సంజయ్‌రావు, బిజెపి మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు మనోజ్, నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో..

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో వర్గ పోరు

- బాన్సువాడ నియోజకవర్గాన్ని పట్టించుకోని రాష్ట్ర అధిష్టానం

నవతెలంగాణ-వర్ని



బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తగ్గడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో యువజన కాంగ్రెస్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. దీంతో పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాలరాజు వర్గం, ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి చెందిన యువకులు పోటీలో ఉన్నారు. పోటీలో ఉన్న యువకులను గెలిపించుకోవడానికి పెద్దలు పాత్ర వహిస్తున్నారు. ఒక వర్గం వారు నియోజకవర్గంలో మేమే సర్వం అంటుండగా.. లేదు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనకే ఇంచార్జి ఇచ్చారు.. తగ్గేదేలే అని మరొకరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరి గెలుపో..

ఒకే పార్టీ, ఒకే జెండా అయినా వర్గాలతో పోటీలో యువకులు అయోమయమవుతున్నారు. అవసరం అయితే కొట్లాటకు కూడా వెనుకాడేది లేదనే తేల్చిచెబుతున్నారు. దీంతో పోటీల్లో ఉన్న యువకుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అధిష్టానం మాత్రం బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జిపై అసలు క్లారిటీ ఇవ్వటం లేదని ఎవరికి మొగ్గుచూపలోనని ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది

- జడ్పీ సీఈఓ చందర్ నాయక్

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జడ్పీ సీఈఓ చందర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్కల్ సాంఘిక మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జడ్పీ సీఈఓ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెట్లను పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కొరకు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం డ్రైడే ఫ్రైడేలో భాగంగా దోమల మందు పిచికారీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభరాణి, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఏపీఓ మధు, పంచాయతీ కార్యదర్శి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరుపోస్తున్న జడ్పీసీఈఓ చందర్ నాయక్

అమర్‌నాథ్ శివలింగ దివ్య దర్శన ప్రారంభోత్సవం

- కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా శాఖ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం అమర్‌నాథ్ శివలింగం దివ్యదర్శనం శుభ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. కామారెడ్డి ఇన్చార్జ్ ప్రజాప్రతా బ్రహ్మకుమారి జయా దీదీ, గంగా లతా, లలిత తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ శివలింగం దర్శనంతో ప్రజలందరూ సత్యమైన జ్ఞానాన్ని పొందాలని, ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. కామారెడ్డి పట్టణ ప్రజలు పాల్గొని శివలింగాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్

ఓంశాంతి కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్..

ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా అమరనాథ శివలింగ దివ్యదర్శనాన్ని రోటరీ క్లబ్ విద్యానగర్ కామారెడ్డిలో ఏర్పాటు చేశారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం రోజున ఉదయం అమర్నాథ శివలింగ పూజ ప్రారంభోత్సవం నిర్వహించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి సతీసమేతంగా వచ్చి అమరనాథుని దివ్య దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, వనిత రామ్మోహన్, పంపరి లతా శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సుధాకర్, అనిల్, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల వరలక్ష్మీ వ్రతం

నవతెలంగాణ-లింగంపేట్/గాంధారి/రెంజల్

మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిరంలో సామూహిక వరలక్ష్మి వ్రతం వేద పురోహితులు సత్యప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల మహిళలు విద్యార్థుల తల్లితండ్రులు, శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు కొత్త దుర్గయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, సభ్యుల శివయ్య, చందు, బాలకిషన్ ప్రధానాచార్యులు సుమలత, మాతాజీలు, ఆచార్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ప్రత్యేక అలంకరణతో శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

రెంజల్ : మండలంలో ఘనంగా వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఇందులో భాగంగా రకరకాల ప్రసాదాలను వండి నైవేద్యం చూపించారు.




గాంధారి :వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు.. లింగంపేట్‌లో..

పలు చోట్ల బంద్..

నవతెలంగాణ-విలేకరుల బృందం

గాంధారి : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారులకు నిరసనగా గాంధారి మండల కేంద్రంలోని హిందూ సంఘాల పిలుపు మేరకు గురువారం బంద్ పాటించారు. గాంధారి బంద్ సంపూర్ణంగా ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్ పాటించారు.

నాగిరెడ్డిపేటలో బంద్ ప్రశాంతం..

నాగిరెడ్డిపేట్ : హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణ సముదాయాలు అన్నీ కూడా బంద్ చేయించి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఈశ్వర్, గంపల వెంకన్న, కుమార్, కృష్ణ, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నాగిరెడ్డిపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పలువురు

నేడు బంద్‌కు పిలుపు..

భిక్కనూర్ : బంగ్లాదేశ్‌లో హిందు వులపై జరుగుతున్న దాడులు, ఆకృత్యాలను నిరసిస్తూ శనివారం రామదండు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో భిక్కనూర్ పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చినట్టు సంఘం సభ్యులు తెలిపారు. వ్యాపారస్తులు, రాజకీయ పార్టీల, హిందూ సంఘాలు, పట్టణ ప్రజలందరూ స్వచ్ఛందంగా పూర్తిస్థాయిలో సంపూర్ణ బందు పాటించి రామదండు, హిందూ సంఘాలకు మద్దతు తెలిపాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్ బంద్..

బోధన్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం బోధన్ బంద్‌కు పిలుపిచ్చినట్లు హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ బంద్‌కు విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

సైబర్ నేరాలతో మోసపోవద్దు

- లింగంపేట్ బస్టాండ్‌లో అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-లింగంపేట్

సైబర్ నేరాలతో మోసపోవద్దని పోలీసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో షీటీం బృందం సభ్యులు సైబర్ నేరాలపై తదితర అంశాలమీద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం బృందం సభ్యులు మాట్లాడుతూ.. అమాయక ప్రజలు సైబర్ నేరాలకు మోసపోవద్దన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్‌ఖాతా వివరాలను గుర్తుతెలియని వ్యక్తులకు సమాచారం ఇవ్వవద్దని వారు సూచించారు. సెల్‌ఫోన్‌లో వచ్చిన లింకులను ఓపెన్ చేయొద్దని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. మహిళల పట్ల కాలేజీ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో 100కు కాల్ చేయాలని సూచించారు. కాలేజీ విద్యార్థులను ఆకతాయిలు వేధిస్తే 1930కు వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం బృందం సభ్యులు సుప్రజ, శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్, హెూంగార్డు షబ్బీర్ ప్రయాణికులున్నారు.

వాజ్‌పేయి వర్ధంతి


వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కోఆర్డినేటర్ జక్సాని దత్తు రాములు, బిజెపి సీనియర్ నాయకులు బొల్లారం సాయిలు, రాజారాం, బాలయ్య, చామంతుల వెంకటి, జక్సాని విఠల్, ఆకుల కృష్ణ, ఇస్వర్ పోచయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీ, అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు పాడవడంతో శుక్రవారం విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ ట్రాన్స్‌ఫార్మర్లు కొంతమేర మరమ్మతులకు గురికావడంతో త్రీఫేజ్ కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, అందువల్ల సింగల్ ఫేస్ కరెంటు సరఫరా చేశామని, యథావిధిగా త్రీఫేస్ కరెంటు సరఫరా సేవలను అందుబాటులోకి తేవడానికి మరమ్మతులు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. ఈ క్రమంలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది.

నవతెలంగాణ
నిజామాబాద్
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

ప్రతిభ చాటిన శ్రీ చంద్ర హైస్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలోగల శ్రీ చంద్ర హైస్కూల్ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో ప్రతిభ చూపుతున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ రవి శుక్రవారం తెలిపారు. స్వతంత్ర దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలలో 8వ తరగతి చదువుతున్న సాయి శృతి కబడ్డీ పోటీలలో మొదటి బహుమతి సాధించినట్టు తెలిపారు. కాగా సాయి శృతి పట్టణంలోని నటరాజ నృత్యానికేతన్ బాశెట్టి మృణాళిని కూతురు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల యజమాన్యం పో ల్యం నారాయణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను అభినందించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, రెగ్యులర్ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు ఐదవ రోజు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనంలో జరుగుతున్న పీజీ పరీక్షలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యాదగిరి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ పరీక్షలు తెలంగాణ వర్సిటీ మెయిన్ క్యాంపస్, తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్ బిక్నూర్, గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో మధ్యాహ్నం జరిగినాయని తెలిపారు. ఈ పరీక్షలకు 773 మంది విద్యార్థులకు 738 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

వ్యవసాయాధికారి బదిలీ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల వ్యవసాయాధికారి ఏ.రాజ్ కుమార్ బదిలీపై శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంకు వెళ్లారు. ఆయన స్థానంలో మరొకరు రావాల్సి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా రైతులకు అనేక సూచనలను అందించారని, వారి సేవలను మరిచిపోలేమని కిసాన్ ఖేత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్లడంతో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, రైతు సోదరులు వ్యవసాయాధికారి రాజ్ కుమార్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో వేంపల్లి, రెంజర్ల సొసైటీ ఛైర్మన్‌లు జక్క రాజేశ్వర్, కోమటిశెట్టి గంగాధర్, నాగంపేట్ ముత్తెన్న, రెంజర్ల మహేందర్ రెడ్డి, ఏట్టెం మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు..

శాంభవి హైస్కూల్‌లో రాఖీ పండుగ

నవతెలంగాణ-బాల్కొండ


రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

మండల కేంద్రంలోని శాంభవి హై స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులు రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు పరస్పరంగా రాఖీలు కట్టి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నా చెల్లెలు, అక్క తమ్ముడి పరస్పర ప్రేమకు ప్రతీక అని విద్యార్థులకు వివరించారు. ఈ పండుగ రోజున, ఒక సోదరి తన సోదరుడు తన జీవితాంతం కష్ట సమయాల్లో తనను రక్షిస్తాడనే నమ్మకంతో తన సోదరుడి మణికట్టుపై రాఖీ కడుతుంది. మనమందరం పరస్పర సంబంధాలకు, ప్రేమతో జీవితాలకు విలువ ఇవ్వాలని పిల్లలకు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో రాఖీ పౌర్ణమి సంబరాలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో గల జెంటిల్ కిడ్స్ పాఠశాలలో రాఖీ పౌర్ణమి పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ లత పిల్లలకు రాఖీలను కట్టిస్తూ రాఖీ పండుగ యొక్క ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల రెస్పాండ్ ప్రకాష్ గుజరాతి మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నా చెల్లెళ్ల మధ్య తమ్ముళ్ల మధ్య అనురాగాన్ని ఆత్మీయతని పెంపొందించడానికి ప్రతి సంవత్సరం జరుపుకోవడం జరుగుతుంది అని పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పిల్లలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- ఎస్ఐ మనోజ్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రవ్యాప్తంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇందల్‌వాయి ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు 15 అగస్టు నుండి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ఖచ్చితమని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదంలో ప్రజలు, వాహనదారులు తమ విలువైన పాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం తప్పకుండా హెల్మెట్ ధరించి విధులకు హాజరుకావాలని అన్నారు. పట్టుబడితే పోలీస్ శాఖ ఉద్యోగులకు కూడా జరిమానా విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడిపి లేని ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నూతనంగా వచ్చిన చుట్టాల ప్రకారమే చర్యలు ఉంటాయని, మైనర్‌లకు ద్విచక్ర వాహనం ఇవ్వవద్దని సూచించారు. ఇతర సాధారణ ప్రజలైన ఏవరైనా తనిఖీలో పట్టుబడితే జరిమానా తోపాటు వాహనాన్ని సీజ్ చేసి రవాణా శాఖ కార్యాలయంకు పంపించడం జరుగు తుందన్నారు. తనిఖీలు నిర్వహించి నప్పుడు పోలీసులకు వాహన దారులు సహకరించాలని ఎస్ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ కోరారు.

తహశీల్దార్‌కు అభినందనల వెల్లువ



తహసీల్దార్‌ను అభినందిస్తున్న లయన్స్ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కలెక్టర్ పరేడ్ గ్రౌండ్‌శక్ష తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ చేతుల మీదుగా పి.శ్రీకాంత్ ఉత్తమ తహశీల్దార్ అవార్డును అందుకున్నారు. సందర్భంలో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో పి. శ్రీకాంత్‌ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. లయన్స్ క్లబ్, బీజేపీ పార్టీ నాయకులు సైతం తహశీల్దార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ ఖేత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, ముప్కాల్ మాజీ కొమ్ముల శ్రీనివాస్, వేంపల్లి మాజీ ఉప సర్పంచు జక్క గంగాధర్, మల్లారెడ్డి, సందీప్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల నర్సయ్య, సెక్రటరీ జక్కుల శ్రీనివాస్, సభ్యులు ఏలేటి విజయ రెడ్డి, కొమ్ముల గంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, ముస్కు ముత్తన్న, ఏలేటి మల్లారెడ్డి పాల్గొన్నారు.

వీధులన్నీ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ మకరంద్
- పలు డివిజన్లలో తనిఖీలు


మాట్లాడుతున్న కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 2వ డివిజన్ ప్రాంతంలో ఉన్న కస్తూర్బా విద్యాలయాల రెసిడెన్షియల్ సముదాయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొదట అక్కడ భోజన వసతులు, శుభ్రత, పారిశుధ్యం ఇతర విషయాలు పరిశీలించారు. నగరపాలక సంస్థ అధికారులకు, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు విద్యాసముదాయాల అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. 1500 విద్యార్థినులు విద్యాలయాల సముదాయంలో ఉంటున్నారు. కావున బిల్డింగ్ నుండి మురుగు నీరు అవుట్ లెట్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా విశ్వవిద్యాలయ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, తోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని పలు డివిజన్లలో శుక్రవారం ఉదయం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ తనిఖీలు నిర్వహించారు. జోన్-1 కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రోజువారీగా రికార్డులను రాస్తున్నారా.. లేదా.. అని అడిగి వివరాలు సంబంధిత సిబ్బందిని తెలుసుకున్నారు. అదేవిధంగా డివిజన్ 13 లోని సర్వే నెంబర్ 19 లేఅవుట్ ను నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ తోపాటు పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణ, ఇతర అధికారులు సందర్శించారు. అనంతరం 34, 39వ డివిజన్లలో పర్యటించారు. ఆదర్శనగర్, దుబ్బ, సుభాష్‌నగర్, హమల్వాడి, గౌతంనగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లపై నీళ్ల నిలిస్తున్నాయని కమిషనర్‌కు తెలిపారు. తక్షణమే అధికారులను ఆదేశించి సమస్యను పరిష్కంచారు. ఆయన వెంట పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణ,శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, సిబ్బంది మోహన్ తదితరులున్నారు.

రాష్ట్ర, జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరచాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

రాష్ట్ర, జాతీయ పోటీలలో ప్రతిభ కనబరచాలని ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యాదాత, క్రీడాదాత ఏనుగు దయానంద రెడ్డి సహకారంతో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండకు సుమారు 70 వేల రూపాయల క్రీడా సామాగ్రి అందజేయడం జరిగిందని ప్రధానోపాధ్యా యులు, జక్రాన్ పల్లి మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ పరికరాలను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు అందజేశారు.ఏనుగు దయానంద రెడ్డికి ఈ కార్యక్రమానికి కీలక పాత్ర పోషించిన ఫిజికల్ డైరెక్టర్ రాజ్ కుమార్‌కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ యువత విద్యార్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సింగారం గంగా జమున, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బోదాస్ వెంకన్న, సభ్యులు సింగారం మనోహర్, మాజీ ఎస్ఎంసి చెర్మెన్ చిక్కాల గంగా నర్సయ్య, గ్రామ యువకులు ఉపాధ్యాయ బృందం సాయిలు, రామకృష్ణ, డాక్టర్ నరసింహ, గంగాధర్, సునీత, కృష్ణ, మాలతి, ఫిజికల్ డైరెక్టర్ మర్యంటి గంగా మోహన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

57మంది విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్లు


ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యుత్ సంస్థలో 2019లో జూనియర్ లైన్మెన్‌గా ఉద్యోగంలో చేరి ఇప్పటివరకు సక్రమంగా విధులు నిర్వహించిన డివిజన్ జేఎల్ఎం 57 మందికి ప్రమోషన్లు పొందినట్టు విద్యుత్ శాఖ డిఈ హరిచంద్ నాయక్ శుక్రవారం తెలిపారు. ఎన్‌పిడిసి ఎల్‌జేఎల్‌ఎంలకు, సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్లో 57మంది ఏఎల్ఎంగా ప్రమోషన్లు పొందారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా బొకేతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంచి పెడుతూ టపాకాయలు కాల్చారు. కార్యక్రమంలో డివిజన్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కే నరేందర్ నాయక్, కన్వీనర్ సల్ల శ్రీనివాస్ యాదవ్ సంజీవ్, నర్సయ్య, ఎండి షకీల్, రామ్‌చందర్ వేణుగోపాల్, సురేష్ బాబు, అనిల్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-ఆర్మూర్

టెక్నికల్ కోర్సులతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సాయి టెక్నికల్ ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ జక్కుల రాజేందర్ యాదవ్ శుక్రవారం తెలిపారు. తమ ఇనిస్టిట్యూట్‌లో ఏసీ మెకానిక్ ఎలక్ట్రిషియన్ రెండు నెలల కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గుర్తింపు సర్టిఫికెట్ అందజేశారు. హైదరాబాద్ పట్టణంలో ప్రముఖ కంపెనీలలో సైతం ప్లేస్‌మెంట్లు ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఇంచార్జి చుక్కల రమణయ్య, ట్రేడ్ ఇన్స్టిట్యూట్ కేశవ్ కుమార్,, స్రవంతి,, స్వాతి, ఇనిస్టిట్యూట్ విద్యార్థులు పాల్గొన్నారు.



100 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

రైతు కృతజ్ఞత సభ

నవతెలంగాణ-మోపాల్


ట్రాక్టర్‌పై వస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఒండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి ఆధ్వర్యంలో 100 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. మోపాల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి ట్రాక్టర్ నడుపుతుండగా పక్కన ఎమ్మెల్యే భూపతిరెడ్డి కూర్చుని మండల చౌరస్తా నుండి మండలకేంద్రంలోని రైతు వేదిక వరకు ట్రాక్టర్ పైనే కార్యకర్తలతో కలిసి ప్రయాణించారు. రైతు వేదికలో ముప్పగంగారెడ్డి, సాయి రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మొదటగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక శాసనసభ్యుడు భూపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికీ మోపాల్ మండలానికి 28 కోట్ల నిధులు కేటాయించారని అన్నారు. పాత డిజైన్ ప్రకారమే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుని చేపట్టే విధంగా అలాగే మోపాల్ మండల కేంద్రం గ్రీన్ జోన్ నుండి తొలగించే విధంగా చూడాలని మండల ప్రజల తరపున కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ మాట ఇచ్చిన ప్రకారం రేవంత్ రెడ్డి రెండు లక్షల రుణమాఫీ చేశారని అన్నారు. ఏదైనా టెక్నికల్ సమస్య వల్ల ఆలస్యం కావచ్చు తప్ప ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకోవడం దాచుకోవడం తప్ప పది సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. కనీసం లక్ష రూపాయల రుణమాఫీ కూడా చేయలేదని అటువంటి దౌర్భాగ్య ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రుణమాఫీ చేస్తే హరీశ్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పాడు కదా సిగ్గుంటే రాజీనామా చేసి తీరాలని అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమం టైంలో అగ్గిపెట్ట దొరకలేదని ఇప్పుడు రాజీనామా చేయడానికి కూడా కాగితం దొరకడం లేదా అని ఎద్దేవా చేశారు. తన కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి దోచి పెట్టాడని విద్యుత్ శాఖలో 70 వేల కోట్లు సివిల్ సప్లైలో 50వేల కోట్లు ధరణి మొత్తం అవినీతిమయంగా ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి శాఖలో అవినీతి కూరుకపోయిందని అన్నారు. ఏ ఒక్కరి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3400 ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎవరికైతే అర్హులకు రుణమాఫీ జరగలేదో బ్యాంకర్లతో, అగ్రికల్చర్ ఆఫీసర్ తోటి మాట్లాడి వారికి రుణమాఫీ జరిగే విధంగా చూడాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయి రెడ్డి శేఖర్ గౌడ్, ఎన్ డిసిసి బ్యాంక్ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, లింగన్న, సొసైటీ చైర్మన్లు మోహన్ రెడ్డి, గంగారెడ్డి, జలంధర్ రెడ్డి, ఫిషరీస్ అధ్యక్షుడు శ్రీనివాస్, చామకూర అనిల్ రెడ్డి, ప్రతాప్, గంగా ప్రసాద్, సతీష్ రావు, ముత్యం రెడ్డి, కన్నిరాం, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజయ్ విద్యార్థి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పరిశోధకసంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా ఇన్నోవేటర్ సైన్స్ ఎగ్జిబిషన్ ఆగస్టు 15, గురువారం కలెక్టర్ గ్రౌండ్‌లో ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో విజయ్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న పి. రోహన్, గైడ్ టీచర్ మధు వి.కె సారథ్యంలో రోడ్లపై ఏర్పడిన గుంతలను ఎలా పూడ్చివేయాలి అనే అంశంపై తన ప్రాజెక్టును ప్రదర్శించారు. దీనిపై కలెక్టర్ చిన్నారిని ప్రశంసంచి సర్టిఫికెట్ అంజేశారు. కూలిన ఇళ్ళ శిథిలాలను చిన్నచిన్న భాగాలుగా విడగొట్టి మొదటగా రోడ్లపై ఏర్పడిన గుంతలలో సమాంతరంగా వేసి, దానిపై వాహనాల పాతటైర్లను, వాడిపడేసిన ప్లాస్టిక్ కవర్లను కాలిస్తే వచ్చే పదార్థాలను డాంబరుతో కలిపి ఈ గుంతలను పూడ్చవచ్చుని, విద్యార్థులకు తన ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి పి. రోహన్‌ను, గైడ్ టీచర్ మధు, విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు డా. అమృతలత ప్రత్యేకంగా అభినందించారు.

వివాహ వేడుకలో కలిసిన చిన్ననాటి స్నేహితులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


వివాహ వేడుకకు హాజరైన సందర్భంగా చిన్ననాటి స్నేహితులతో..

మండలంలోని చౌట్ పల్లిలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలో 26 సంవత్సరాల తర్వాత చిన్ననాటి స్నేహితులంతా ఒకచోట కలిశారు. చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులంతా 26 సంవత్సరాల తర్వాత తమ తోటి స్నేహితుడు తోట శ్రీధర్ కూతురు రశ్మిత వివాహ వేడుకకు హాజరయ్యారు. చౌట్‌పల్లిలో శుక్రవారం ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు చిన్ననాటి స్నేహితులంతా హాజరయ్యారు. వివాహ వేడుకకు హాజరైన సుమారు 30 మంది స్నేహితులంతా ఒక్కచోట కలవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అంతా ఒక చోట చేరి గ్రూప్ ఫోటోలు దిగారు. ఆత్మీయతో మాట్లాడుకుంటూ కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 26 సంవత్సరాల తర్వాత స్నేహితుని కూతురు వివాహ వేడుకలో కలుసుకోవడం పట్ల తమ సంతోషం వ్యక్తం చేశారు.

రెండు లారీలు ఢీ..

- ఒకరికి గాయాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్నారం గ్రామ శివారులో రాజస్థాన్‌కు చెందిన పార్సెల్ లోడ్‌తో వెళ్తుండగా ముందర వెళ్తున్న ఇంకొక్క లారీ డ్రైవర్ అతి వేగంగా అజాగ్రత్తతో సడెన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుండి వస్తున్న లారీకి ప్రమాదం జరిగిందని పోలిస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. వెనుక లారీ లో వున్న డ్రైవర్ సఫ్రాన్‌కి గాయాలపాలైనట్లు అయన వివరించారు.బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ హెచ్ ఓ .మనోజ్ కుమార్ పేర్కొన్నారు. కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి ప్రమాదానికి గురైన లారీని టోల్ ప్లాజా వద్ద ఉన్న క్రేన్ సహాయంతో తొలగింప జేసీ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

గ్రామస్తులకు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్, వేంపల్లి, కొత్తపల్లి, వెంచిర్యాల గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎంపీవో మహమ్మద్ గౌస్ శుక్రవారం పర్యవేక్షించారు. గ్రామాల్లో మురుగు కాలువలు, చెత్తాచెదారం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠ ధ్వామం తదితర ప్రాంతాలను పరిశీలించారు. మురికి నీరు, చెత్త చెదరంతో ప్రజలు రోగాన బారిన పడకుండా నివారణ చర్యలు చేపట్టారు. పంచాయతీ సెక్రటరీలు, గ్రామస్థులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు దరఖాస్తులు చేసుకోండి

నవతెలంగాణ-ఆర్మూర్

వచ్చేనెల 14, 15, 16 తేదీల్లో హిందీ ప్రచార సభ పరీక్షలు విశారద, భూషణ్, సంపూర్ణ విద్వాన్ నిర్వహించడం జరుగుతుందని డివిజన్ హిందీ ప్రచారకర్త డీజే శాంతి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, 9398479751 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతుపై ఎలుగుబంటు దాడి



దాడిలో గాయపడిన చిన్నబాలయ్య

నవతెలంగాణ-రామారెడ్డి

రైతుపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన మండలంలోని మద్దికుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొడగండ్ల చిన్నబాలయ్య గ్రామ శివారులో పంట పొలాల్లో గేదెలను మేపడానికి మరో ముగ్గురు రైతులతో కలిసి ఉండగా ఒక్కసారి మూడు ఎలుగుబంట్లు రావడం, ఒక ఎలుగుబంటి దాడి చేయడంతో చిన్న బాలయ్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి





పోచయ్య (ఫైల్).. మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

మండలంలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన చిటుకుల పోచయ్య (38) శుక్రవారం తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు వైర్లు సరి చేస్తూ కరెంట్‌షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం చిట్కుల పోచయ్య తన అల్లుడు చిట్కుల రమేష్‌తో కలిసి కరెంటు వైర్లు సరిచేస్తుండగా కరెంట్ షాక్ రావడంతో చిట్కుల పోచయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు పోచయ్య భార్య పారిజాతం ఫిర్యాదులో పేర్కొనడంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- వైద్యులు అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర వైద్య కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)/బోధన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య కమిషనర్. డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం రాష్ట్ర వైద్యా విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ బాన్సువాడ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని పలు వార్డుల్లో తిరుగుతూ వార్డులను పరిశీలించారు. వైద్యులు వైద్య సిబ్బంది చేస్తున్న సేవలపై రోగులకు వారి కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కామారెడ్డి జిల్లాలో ఉన్న రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న కామారెడ్డి, గాంధారి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, మధుర తదితర ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వైద్యులకు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలోని డయాలసిస్, ఆపరేషన్ థియేటర్, పాలియేటివ్ కేర్‌సెంటర్, చిత్ర చికిత్స వార్డ్, ఎమర్జెన్సీ వార్డు, రక్తనిధి కేంద్రం, సెంట్రల్ ల్యాబ్, స్కానింగ్ సెంటర్, ఆర్టీసీఆర్ కేంద్రాలను పరిశీలించారు. ప్రజలకు వర్షాకాలం కారణంగా డెంగ్యూ, మలేరియా, ఇతర సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పట్టణాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. వీరి వెంట వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, బాన్సువాడ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ : సూపరింటెండెంట్‌లతో సమావేశం..



బోధన్ : ఆస్పత్రిని పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య శాఖ కమిషనర్

వైద్యులు అందుబాటులో ఉండాలి..

బోధన్ : బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు రోగులకు ఇబ్బందులు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బోధన్, బాన్సువాడ జిల్లా ప్రభుత్వాసుపత్రులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి ఆసుపత్రిలో మౌలిక వసతులపై సిబ్బందిని రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ కొరత ఉందని వైద్య సిబ్బంది సూచించగా ఆయన స్పందించి త్వరలోనే నియామకాలు చేపడతామని తెలిపారు. ఆయన వెంట డిసిహెచ్ఎస్ శివశంకర్, జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్, ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ సుమన్, ఆర్ఎంఓ సోఫీ, వైద్యులు సందీప్, విగ్నేశ్వర్, ఫార్మసిస్ట్ జగదీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఈవీఎం గోదాంలను సందర్శించిన కలెక్టర్



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రెండు ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం గోదాం తాళాలను తీయించారు. గోదాంలో ఉన్న చెడిపోయిన ఈవీఎంలను పరిశీలించారు. ఈవీఎంలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈవీఎంలను ఈసీఎల్, బెంగళూరు, బెంక్, బిహెచ్ఎల్ కంపెనీలకు పంపుతామని ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రఘునాథరావు, ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్ కుమార్, ప్రియదర్శిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంజన్, కాసిం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశంతో వేగవంతమైన డ్రైనేజీ నిర్మాణ పనులు



చేపడుతున్న డ్రయినేజీ నిర్మాణ పనులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఎర్రమన్నుకుచ్చ ప్రాంతంలో టియు ఎఫ్ఐడిసి నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పనులను వేగవంతంగా పూర్తి చేసి స్థానిక ప్రజలకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించడంతో నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగిస్తున్నారు. త్వరతగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ఎల్లారెడ్డి మున్సిపల్ అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ అభివృద్ధికి కావలసిన మరిన్ని పనులను గుర్తించి సకాలంలో చేపట్టి ఎల్లారెడ్డి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్నారంలో దోమల నివారణ మందు పిచికారీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం దోమల నివారణ మందును గ్రామపంచాయతీ కార్యదర్శి సాగర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ గౌడ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా, గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించినట్టు వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

అన్నా బావుసాటే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో సాహిత్య రత్న లోక శాహిర్ అన్నా భావుసాతే 104వ జయంతి వేడుకలలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్నూర్ మండల కేంద్రంలోని అన్నా భావు సాతే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఏటా మహనీయుల జయంతి వేడుకలు జరుపుకోవడమే గాక వారు చూపించిన మార్గాల్లో నడవాలని వారి ఆశయ సాధనల కోసం పునరంకితం కావాలని సూచించారు. యువత చెడు అలవాట్లను వదిలేసి సన్మార్గంలో నడవాలని ఆశించారు. జుక్కల్ నియోజకవర్గంలో దళితులు ఇంకా సొంత ఇళ్లు లేక, ఉపాధి అవకాశాలు లేక, అత్యంత పేదరికంతో దయనీయ స్థితిలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోయి అందరూ గౌరవంగా జీవించాలంటే అది కేవలం విద్య వల్లే సాధమవుతుందని అన్నారు. అందుకే అందరూ తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. దళిత గిరిజన బడుగుబలహీనవర్గాలకు చెందిన పిల్లల విద్యాభివృద్ధికి తాను కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్న బహుసాటే ఉత్సవ కమిటీ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సిపి కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, బోధన్ సిఐ నరేష్ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపించే యజమానులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఫోర్ వీలర్ సీటు బెల్టు వాహనానికి సంబంధించిన పత్రాలు తదితర అంశాలను అవగాహనలో భాగంగా పరిశీలించి వారం రోజుల తర్వాత వాహనాల తనిఖీ కఠినంగా ఉంటుందని, రుసుముతో పాటు కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి, ఎడపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ పట్టణ కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలో కురుమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో కుర్మ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో అధ్యక్షులుగా ఒగ్గు గంగారాం, ఉపాధ్యక్షులుగా ఉప్పరిగారి సాయిగొండ, ప్రధాన కార్యదర్శిగా ఎడిగి మల్లయ్య, కోశాధికారిగా పరుగొండ సాయిలు, కార్యవర్గ సభ్యులు దుర్కి పెద్ద సంగయ్య, కురుమ గంగాధర్, బీర్కూర్ హన్మండ్లు, కొత్త కురుమ మల్లేష్, గజ్జెల రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఉప్పరిగారి బీరుగొండ, పరుగొండ గంగారాం, ఉప్పరిగారి నర్సుగొండను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సంఘం అభ్యున్నతికి పాటుపడతామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రతినిధులు తెలిపారు. కురుమల కోసం ప్రభుత్వం ద్వారా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపల్‌లో
అధికారుల, సిబ్బంది కొరత

- ముందుకు సాగని పనులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో పెద్ద మున్సిపాలిటీ అయినటువంటి కామారెడ్డి మున్సిపాలిటీలో మేనేజర్ బదిలీపై వెళ్లగా ఇంతవరకు మేనేజర్ రాలేదు. రెవెన్యూ అధికారిని ఇన్చార్జి మేనేజర్‌గా కొనసాగిస్తున్నారు. కామారెడ్డి మున్సిపల్‌లో అధికారుల సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో పట్టణంలో పనులు చేయాలంటే ముందుకు సాగడం లేదు. సానిటేషన్ విభాగంలో ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో మున్సిపల్ కార్మికులు వారికి తోచిన విధంగా చెత్తను సేకరిస్తుండడంతో కామారెడ్డి మున్సిపల్‌లో అక్కడక్కడ ప్రధాన కూడలిలో ప్రజలు, దుకాణ సముదాయాల వ్యక్తులు, ఆస్పత్రి వారు చెత్తను పారవేయడంతో పట్టణంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శానిటేషన్ ఒకదాంట్లోనే కాకుండా ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగంలో సైతం ఖాళీలు ఉన్నా.. ఇక్కడికి వచ్చేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్న కామారెడ్డికి చెందిన ఓ ప్రతిపక్ష నాయకుని పిఏ ఇక్కడికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఉద్యోగులకు ఫోన్లు చేసి మీరు ఆరు నెలల వరకు ఇక్కడికి రావొద్దని ఒకవేళ వస్తే మిమ్మల్ని ఏసీబీకి ట్రాప్ చేపిస్తామని బెదిరించినట్లు సమాచారం.



పురపాలక సంఘం కార్యాలయం

ఇంజనీరింగ్ విభాగంలో డిఈ వేరే డిపార్ట్మెంట్ నుంచి ఈ డిపార్ట్మెంట్లో ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. ఏఈలు ఇద్దరు ఉండవలసి ఉండగా ఆ ఇద్దరు జనరల్ బదిలీలు కాగా ఒక్కరే వచ్చారు. ఆ ఒక్కరు కూడా పంచాయతీరాజ్ నుంచి ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఇద్దరు వచ్చినా.. ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లిపోగా ఒకరు ఇన్చార్జిగా వారంలో నాలుగు రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు ఇద్దరు బదిలీ కాగా ఒక్కరే వచ్చారు.

ఆ ఒక్కరు కూడా మూడు రోజులు కామారెడ్డిలో, మూడు రోజులు హైదరాబాద్ దగ్గరలోని మున్సిపాలిటీలో మూడు రోజులు విధులు నిర్వహిస్తున్నారు. బిల్డింగ్ సూపర్వైజర్‌గా నాలుగు పోస్టులు ఖాళీ ఉండగా ఆ నాలుగు ఖాళీగానే ఉన్నాయి. శానిటేషన్ విభాగంలో రెండు ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీ ఉండగా ఆ రెండు కూడా ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతున్న ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ఇక్కడికి ఉద్యోగులను తెప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా కొందరు వచ్చేందుకు సిద్ధంగా ఉండగా, కామారెడ్డికి చెందిన ప్రతిపక్ష నాయకుని పిఏ ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న అధికారులకు ఫోన్లు చేసి మీరు ఆరు నెలల వరకు ఇక్కడికి రావొద్దని ఒకవేళ మా మాట కాదని వస్తే మిమ్మల్ని ఏసీబీకి ట్రాప్‌చేసి ఇంటికి పంపించాల్సి ఉంటుందని బెదిరించినట్లు సమాచారం. దీంతో మున్సిపల్‌లో పలు పనులు పెండింగ్లో పడుతున్నాయి. ఇప్పటికైనా రాజకీయ నాయకులు పట్టణ అభివృద్ధికి సహకరించాలని, రాజకీయ కక్షలు ఏమైనా ఉంటే వారు వ్యక్తిగతంగా చూసుకోవాలని, సామాన్య ప్రజలను మాత్రం ఇబ్బంది పెట్టకూడదని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సరస్వతి శిశు మందిర్‌లో వరలక్ష్మి వ్రతం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట సరస్వతి శిశుమందిర్ సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని గురువారం నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని వ్రతాన్ని కుటుంబంతో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు దంపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ మండలంలో భారీ వర్షం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వారం పది రోజులుగా వేసిన పంటల్లో నీరు నిలువకపోవడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు కుండపోతగా వర్షం కురవడంతో కుంటలు నిండటమే కాకుండా, వరి పొలాలలోకి నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోచారం రాజీనామా చేసి పోటీచేయాలి

- మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ జుబేర్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)



మాట్లాడుతున్న షేక్ జుబేర్

బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన నాయకులను, కార్యకర్తలను రాజకీయ పరంగా ఎదగనివ్వకుండా ఓటు బ్యాంకుగా వాడుకున్నారని బాన్సువాడ బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్ ఆరోపించారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని జుబేర్ నివాసం వద్ద బీఆర్ఎస్ నాయకులతో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, నియోజకవర్గం బీఆర్ఎస్ నేత షేక్ జుబేర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రధాన నాయకులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన హుందాతనానికి తగదని, రుణమాఫీపై ప్రతిపక్ష నాయకులు మాట్లాడితే తప్పేమిటని ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా, స్పీకర్‌గా పనిచేసినప్పటికీ తన కింద ఉన్న నాయకులు, కార్యకర్తలను ఎదిగనివ్వకుండా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం వెంట ఉన్న నాయకులు ఎవరైనా రాష్ట్రస్థాయి పదవులు పొందారా అంటూ ప్రశ్నించారు. ఏ పదవిలో వచ్చినా తమ కుటుంబ సభ్యులకే అని అన్నారు. గత 30 ఏళ్లుగా నియోజకవర్గంలో నిజంగా పేదలు పేదవాళ్లుగానే ఉన్నారని.. ఉన్నవాళ్లు ఉన్నవాళ్లగనే ఎదుగుతున్నారని తెలిపారు. ఏదైనా సమస్య ఉందని నేరుగా ఎమ్మెల్యేకు కలిసే పరిస్థితి లేదన్నారు. సామాన్య వ్యక్తి ఎమ్మెల్యేను కలవాలంటే తన కిందిస్థాయి వ్యక్తిగత సహాయకులను కలవాల్సిందేనని తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పుడు వింటారని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మి పుత్రుడు అని.. కాంగ్రెస్ పార్టీలో ఐరన్ లెగ్ పుత్రుడుగా మిగిలిపోయారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో గెలుపొందాలని ఆయన డిమాండ్ చేశారు. నిజంగా ప్రజలకు సేవనే చేసి ఉంటే ప్రజలు తప్పకుండా మిమ్మల్ని గెలిపిస్తారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో సేవలు చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెళ్లడంతో బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు గ్రూపులుగా విడిపోయాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుంటలో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

గుంటలో పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని అచ్చంపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాబు (21) అనే యువకుడు బర్రెలు మేపడానికి వెళ్లాడు. ఈ క్రమంలో గంగాసాని గుంటలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. ఈతరాకపోవడంతో నీటమునిగి మృతి చెందాడు. తండ్రి మహబూబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

